

8న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18 నుండి 35ఏళ్ల మధ్య వయసుగల నిరుద్యోగులకు ఈనెల 8న ప్రభుత్వఐటిఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇన్నోవా సోర్స్, జెస్ట్ డయల్ లిమిటెడ్, మెడ్ ప్లస్, జాబ్‌డీలర్స్, స్పందనా స్ఫూర్తి ఫైనాన్సు లిమిటెడ్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు killuniverse.apssdc.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ , జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు జాబు మేళాకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరములకు నెంబర్ 7995691295 లేదా టోల్ ఫ్రీ 9988853335లో సంప్రదించాలని కోరారు.

ఇసుక కోసం పాట్లు



ఇసుక లేక ఖాళీగా ఉన్న బొబ్బిలిలోని స్టాక్ పాయింట్

- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా సకాలంలో ఇవ్వని డెలివరీ
- పనులు లేక ఇబ్బందులు పడుతున్న నిర్మాణ రంగ కార్మికులు
- జోరందుకున్న అక్రమ రవాణా

ప్రజాశక్తి-బొబ్బిలి

అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని టిడిపి కూటమి ఇచ్చిన హామీ ఎక్కడ అమలు కావడం లేదు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వం సేకరించిన ఇసుక నిల్వలను టన్ను ఇసుక రూ.605కు సరఫరా చేశారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో వైసిపి ప్రభుత్వం హయాంలో నిల్వ చేసిన 48,311 మెట్రిక్ టన్నుల ఇసుకను వారం రోజులు క్రితం వరకు సరఫరా చేశారు. నిల్వలు అయిపోవడంతో ఇసుక కోసం ప్రజలు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణాలకు, రోడ్లు, కాలువలు నిర్మాణానికి, పరిశ్రమల అవసరాలకు ఇసుక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదుల నుంచి ఎద్దులు బళ్లతో ఇసుక సరఫరా అవుతున్నప్పటికీ అవసరాలకు సరిపడా ఇసుక అందడం లేదని భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టర్లు వాపోతున్నారు. భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులు నత్తనడకన సాగడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరక్క తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా సకాలంలో ఇవ్వడం లేదు

ఉచిత ఇసుక కోసం ప్రభుత్వం ప్రారంభించిన వెబ్‌సైట్‌లో ఇసుక బుక్ చేసుకున్న వారికి వారం రోజుల క్రితం నుంచి సకాలంలో ఇసుక అందడం లేదు. ఆన్‌లైన్‌లోబుక్ చేసుకున్న వాహనానికి ఉన్న జిపిఎస్ ఇసుక కేంద్రంలో జిపిఎస్ ట్రాక్ అయితేనే ఇసుక ఇస్తున్నారు. జిపిఎస్ ట్రాక్ అవ్వకపోతే ఇసుక ఇవ్వడం లేదు. ఇసుక కొరత వలనే జిపిఎస్ ట్రాక్ అవ్వడం లేదని కుంటు సాకులు చెప్పి ఇసుక ఇవ్వడం లేదని విమర్శలు వస్తున్నాయి. బుక్ చేసుకున్నా సకాలంలో ఇవ్వకపోవడంతో ఇసుక కేంద్రం వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఇసుక కొనుగోలుదారులు, డ్రైవర్లు వాపోతున్నారు.

పనులు లేక ఇబ్బందులు

ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఇసుక కొరతను నివారించాలని వారంతా కోరుతున్నారు.

ఇసుక కొరతతో జోరందుకున్న అక్రమ రవాణా

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక కొరత ఉండడంతో ఇసుక అక్రమ రవాణా పెరిగిపోతోంది. ఇసుక కొరత కారణంగా బొబ్బిలి మండలంలోని అలజంగి, కారాడ, పారాది, పెంట వేగవతి నది పరివాహక ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. నాటుబళ్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో ఇళ్ల నిర్మాణాలకు నాటుబళ్లతో ఇసుక తరలిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు సరిపడ ఇసుకను నాటుబళ్లతో సరఫరా చేయలేకపోవడంతో ఇళ్లనిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి.

వంగర, కొండ చాకరపల్లి నుంచి ఇసుక సరఫరా

గ్రోత్ సెంటర్లోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక నిల్వలు లేకపోవడంతో వంగర మండలం కొండచాకరపల్లి నుంచి ఇసుక తెప్పించి సరఫరా చేస్తున్నారు. బొబ్బిలి స్టాక్ పాయింట్‌లో రోజుకు 60 నుంచి 70 వాహనాల ద్వారా ప్రతిరోజు 2500 మెట్రిక్ టన్నుల నుంచి 3వేల మెట్రిక్ టన్నుల ఇసుక వెళ్లేది. గతనెల 24తో పాత ఇసుక నిల్వలు అయిపోవడంతో 25 నుంచి కొండచాకరపల్లి నుంచి తెప్పిస్తున్నారు. రోజుకు 3వేల మెట్రిక్ టన్నుల వరకు ఇసుక అవసరం అయినప్పటికీ 150 టన్నుల ఇసుక కూడా రావడం లేదు. దీంతో ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వారికి సకాలంలో డెలివరీ ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అవసరాలకు సరిపడా ఇసుక తెప్పించి పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మార్క్ ఫెడ్ ఛైర్మన్‌గా కర్రోతు బాధ్యతల స్వీకరణ

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా : బంగారాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న కర్రోతు బంగార్రాజు

ప్రజాశక్తి -భోగాపురం

రాష్ట్ర మార్క్ ఫెడ్ ఛైర్మన్‌గా కర్రోతు బంగార్రాజు విజయవాడలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్క్ ఫెడ్ ఎమ్‌డి జిలాని సమూన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ఏర్పాట్లు జరిగాయి. కుటుంబ సభ్యులతో పాటు నాయకుల మధ్య బంగార్రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానని అన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు చేపడతామన్నారు. అంతేకాక పప్పు ధాన్యాలకు, పసుపు, మొక్కజొన్న వంటి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు వేపాడ చిరంజీవి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు పీలా గోవింద్, దీపక్ రెడ్డి, భోగాపురం నెల్లిమర్ల మండలాల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్ కుమార్, నాయకులు సువాడ రవిశేఖర్, మార్క్ ఫెడ్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్

రౌడీలు సత్ప్రవర్తనతో మెలిగేందుకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో వివిధ పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తూ, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులను సంబంధిత పోలీసు అధికారులు శనివారం పోలీసు స్టేషనుకు పిలిచి, కౌన్సిలింగు నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవృత్తిని విడనాడి జీవించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తున్న హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులకు ప్రతీ శనివారం ఆయా పోలీసు స్టేషను అధికారులు స్టేషనుకు పిలించి, కౌన్సిలింగు నిర్వహించాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఆదేశించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తిని విడనాడాలని, లేకుంటే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రస్తుతం వారు ఏ వృత్తులను చేస్తున్నది, ఎలా జీవిస్తున్నది, ఎక్కడ ఉంటున్నది అన్న అంశాలను సంబంధిత పోలీసు అధికారులు విచారణ చేసి, హిస్టరీ షీట్లులో వివరాలను నమోదు చేసారు. వారి జీవన విధానం, నేర ప్రవృత్తిపై నిఘా పెట్టాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు.

టెట్ నామినల్ రోల్స్‌లో తప్పుల సవరణకు అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాస్తున్న అభ్యర్థులకు సంబంధించి హాల్ టికెట్/ నామినల్ రోల్స్‌లో జరిగిన తప్పుల సవరణకు అందుకు సంబంధించిన నకలు సంబంధిత పరీక్ష కేంద్రాల డిపార్టుమెంట్ అధికారులకు సమర్పించా లని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీ కోసం ఎస్ఎస్‌సి తత్సమాన పరీక్షకు సంబంధించిన మార్కుల జాబితా నకలు అందజేయాలని తెలిపారు. కుల మార్పునకు సంబంధించి సంబంధిత అధికారి జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం, స్త్రీ, పురుష సవరణకై ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు (అభ్యర్థి పేరుతో) తీసుకు రావాలని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పార్కులో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య శనివారం పరిశీలించారు. గాంధీ పార్క్ లో చేపట్టిన అభివృద్ధి పనులను, పుత్సల వీధిలో పూర్తయిన బిటి రోడ్డు, హుకుంపేటలో పాక్షిక మరమ్మత్తు పనులను గమనించారు. ఆ తర్వాత జమ్ము ప్రాంతానికి చేరుకున్న ఆయన అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన డ్రైన్లపై ఆక్రమణలు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. ఆల్తి వీధిలో మంచినీటి పంపిణీ ప్రక్రియను గమనించి క్లోరిన్ పరీక్షలను నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఉన్న కమ్యూనిటీ టాయిలెట్లను పరిశీలించారు. జొన్న గుడ్డి ప్రాంతంలో రహదారిపై భవన వ్యర్థాలు ఉండడానికి చూసి అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే భవన వ్యర్థాలు వేసిన వారి తోనే వాటిని తొలగించే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. ధర్మపురి వద్ద వసంత విహార్ విల్లాస్ లో తాగునీటి కుళాయిల ద్వారా నీరు రావడంలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించారు. తక్షణమే అంచనాలు రూపొందించి పైప్ లైన్లు వేసే విధంగా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇఇ కె. శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, ఎఇలు వెంకటేశ్వరరావు, బొడ్డు రవి పాల్గొన్నారు.

బొబ్బాదిపేటలో ఆక్రమణలు తొలగింపు

నగరంలో అనధికార నిర్మాణాలను, ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ పి. నల్లనయ్య స్పష్టం చేశారు. బొబ్బాది పేటలో కాలువలపై ఉన్న నిర్మాణాలను, మెట్లను జెసిబి సహాయంతో పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగించారు. కొద్దిసేపు బాధితులు సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. అయినప్పటికీ సిబ్బంది వాటిని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ ఏ ప్రాంతంలో కూడా అనధికార నిర్మాణాలు గానీ, కాలువలు, ఫుట్ పాత్‌లపై అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.



సిపిఎం జెండా వద్ద రెడ్ సెల్యూట్ చేస్తున్న నాయకులు

ప్రజా సమస్యలపై ఉధృత పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-వేపాడ

ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా సిపిఎం పార్టీ గత మూడేళ్ల కాలంలో ఉధృత పోరాటాలు నిర్వహించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినే సూర్యనారాయణ అన్నారు. శనివారం వేపాడ మండలంలోని కొండ గంగు పూడి శాఖ మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో గిరిజనుల పోడు భూములకు, రెవిన్యూ భూములకు పట్టాలు ఇప్పించాలని సిపిఎం పోరాడి విజయం సాధించిందని అన్నారు. ఇంకా కొన్ని గిరిజన గ్రామాలకు నేటికీ రోడ్లు, మౌలిక వసతులు లేవని, వాటి సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గిరిజనులంతా సంఘటితం అవ్వాలని పిలుపునిచ్చారు. నవంబర్ 9,10 తేదీల్లో జరుగు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, మండల నాయకులు సిహెచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలు, ఎన్ఆర్ఐ వ్యవహారాలు, సెర్ఫ్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం జిల్లాకు రానున్నారు. మంత్రి ఉదయం 4.45 గంటలకు ఫలక్ నుమా ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి చేరుకొని స్థానికంగా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఇసుక రీచ్ తనిఖీ

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని కసుమూరు గ్రామంలోని ఇసుక రీచ్‌ను బొబ్బిలి ఆర్‌డిఒ విఎస్ఎస్ రామ్మోహనరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీచ్ గురించి డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణను వివరాల అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు మండల సర్వేయర్ వెంకటరమణ, విఆర్‌ఒలు ఉన్నారు.



క్రీడా పోటీలను విజయవంతం చేయండి

డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న వివిధ రకాల క్రీడా పోటీలపై స్థానిక విజ్జి స్టేడియంలో శనివారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. క్రీడా పోటీల తేదీలు, నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఐవిపి రాజు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, ఖోఖో, కబడ్డీ వాలీబాల్ కోచ్‌లు, ఇతర క్రీడా ప్రతినిధులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

విజయనగరం టౌన్ : పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు నేపథ్యంలో భక్తులైన బి.శ్రీరామ్ మూర్తి, కె.స్వర్ణలత పేరుతో లక్ష ఒక్క రూపాయి చెక్ ను హుండీలో వేశారు. ఈ మేరకు ఆలయ సహాయ కమీషనర్ డివివి ప్రసాదరావు తెలిపారు.

సిబిఎం స్కూల్లో నియామకాలు చెల్లుబాటు కావు : డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బొబ్బిలిలోని సిబిఎం బాలికోన్నత పాఠశాలకు సంబంధించి కన్వీనర్, కరస్పాండెంట్ , ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినందున చెల్లుబాటు కావని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

సత్యనారాయణ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -విజయనగరం కోట

ఇటీవల మృతి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఆకాశపు మురళీమోహన్ సత్యనారాయణ కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని అన్నారు. పార్టీకి సత్యనారాయణ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

పారదర్శకంగా కెజిబివి ఉద్యోగాల భర్తీ

దళారులను నమ్మి మోసపోవద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో పోస్టుల భర్తీ పారదర్శకంగా జరుగుతుందని, దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని కలెక్టర్ డాక్టర్ బి.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగంబం జిల్లాలో 38 మంది బోధనా సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన 10 మంది బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన ఒక సంవత్సర కాలానికి గానూ నియామకం కోసం ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎర చూపి దళారులు పైరవీలు చేస్తునట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర సంచాలకులు ఇచ్చిన వెబ్‌సైట్ https://apkgbv.apcf-ss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏ పోస్టుకు కూడా మౌఖిక పరీక్షలు గాని, స్కిల్ పరీక్షలు గాని నిర్వహించబడని తెలిపారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభపెడితే ఫిర్యాదు చేయాలని తెలిపారు.

'సీతం'లో ముగిసిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలోవిద్యార్థులకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ కార్యశాలను నిర్వహించారు. ప్రపంచంలోని ప్రముఖ క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌తో వారికి ప్రయోగాత్మక అనుభవాన్ని అందించారు. నిపుణుల నేతృత్వంలోని ప్రాక్టికల్ సెషన్‌లతో క్లౌడ్ స్టోరేజ్, కంప్యూటింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్‌తో సహా అవసరమైన అమెజాన్ వెబ్ సర్వీసెస్ సేవలను వర్క్‌షాప్ లో తెలుసుకున్నారు. నేటి సాంకేతికతతో నడిచే జాబ్ మార్కెట్‌లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను అందించడంలో ఈ శిక్షణ సహాయపడుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి మాట్లాడుతూ కార్యాశాలల విద్యార్థుల భవిష్యత్ సవాళ్లను స్వీకరించడానికి ఉపయోగ పడుతుందని తెలిపారు.

విజన్ -2047 పై చిత్తశుద్ధి ఎంత?



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తగిన ప్రణాళిక లేకుండా ఎంత గొప్ప లక్ష్యాలను రూపొందించు కున్నా దాన్ని చేరుకోవడం కష్టమే. అలాగని గొప్ప ప్రణాళిక రూపొందించి, దాని అమలు చేసే చిత్తశుద్ధి లేకపోయినా అంతే సంగతులు. దీన్నిబట్టి ప్రణాళిక ఎంత ముఖ్యమో దాని అమలు కూడా అంతే ముఖ్యం. సరిగ్గా ఇదే సూత్రం గుర్తుకు తెస్తున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికలు. వికసిత్ భారత్ పేరిట సుస్థిరాభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రకటించింది. దాన్ని అనుసరించి స్వర్ణాంధ్రా విజన్ -2017 అంటోంది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం. రాబోయే 23ఏళ్లలో దేశం, రాష్ట్రం ఎలా ఉండాలన్న దానిపై ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లా, మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించేందుకు ఇటీవల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలోనూ, సేకరించిన అంశాలను ప్రణాళికలో చేర్పించడంలోనూ, చేర్పించిన వాటి అమలు కోసం చేయాల్సిన కృషి విషయంలోనూ ప్రభుత్వం, ప్రభుత్వంలో భాగంగావున్న మన జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల చొరవ ఎంత? రాజకీయ చిత్తశుద్ధి ఎంత? అనేదానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లాలోని వనరులు, వాటి వినియోగం, పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లాలు. సుమారు 80శాతం ప్రజానీకం ఈ రంగంపైనా ఆధారపడి జీవిస్తున్నారు. సారవంతమైన భూములు, ఎన్నో నదులు, జీవ గెడ్డలు ఉన్నాయి. వాటిపై జలాశయలు, ఆనకట్టలు, చెక్ డ్యాంలు కట్టకపోవడం వల్ల నీరు సముద్రంలోకి వృధాగా పోతోంది. దీంతో, సాగు కష్టతరంగా మారిపోయింది. ఫలితంగా పంటల సాగు ఏటా తగ్గుతోంది. భూములు బీడువారుతున్నాయి. పండిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. మార్కెట్ సదుపాయాలు లేవు. ఫలితంగా వ్యవసాయ రంగం కుదేలవుతోంది. దీనిపై ఆధారపడినవారి కొనుగోలు శక్తి తగ్గి, వారి జీవన ప్రమాణాలు కూడా క్షీణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలని, నదులు అనుసంధానం చేయాలని జిల్లా వాసులు చాలా దశాబ్ధాలుగానే గగ్గోలు పెడుతున్నారు. కానీ, ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన తోటపల్లి, రామతీర్థసాగర్, ఝంజావతి తదితర ప్రాజెక్టులు, తలపెట్టిన గుమ్మడిగెడ్డ, గుర్లగెడ్డ తదితరాలను అసంపూర్తిగా వదిలేసింది. మరెన్నో సాగునీటి వనరుల అభివృద్ధి అంశాలు కాగితాలపై ప్రతిపాదనలుగానే మిగిలిపోయాయి. మరోవైపు భూగర్భ జలాలను కూడా సద్వినియోగం చేసేందుకు పాలకులు ప్రయత్నించలేదు.

జిల్లాలో పెద్దగా పరిశ్రమలు లేవు. ఉన్న పరిశ్రమలు మూతపడడంతో పారిశ్రామికాభివృద్ధి క్రమంగా మరింతగా తగ్గిపోతోంది. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం క్రమంగా తగ్గిపోతోంది. ఐదేళ్ల క్రితమే జ్యూట్ మిల్లుల అన్నీ కనుమరుగయ్యాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విజయనగరం పుట్టినిల్లు. ఎంతో నాణ్యమైన మాంగనీస్ గనులు పుష్కలంగా ఉన్నాయి. విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 40 పరిశ్రమలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా ఒకప్పుడు 21 పరిశ్రమలు ఉండగా ప్రస్తుతం పట్టుమని పది పరిశ్రమలు అనేక ఒడిదొడుకుల మధ్య నడుస్తున్నాయి. కొద్ది నెలల క్రితమే కొత్తవలసలోని జింథాల్ పరిశ్రమ మూతపడింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరకడం లేదు సరికదా ఉన్న ఉపాధి కూడా లేకుండా పోతున్నాయి. వీటికి సొంత గనులు కేటాయించడంతో పాటు విద్యుత్ రాయితీలు కల్పించాలి. ఫెర్రో క్రోం ఎగుమతి, దిగుమతులకు రాయితీలు కల్పించాలి. ఆధునీకరణ పేరిట గత ప్రభుత్వం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని మూసేసింది. అప్పులు తీర్చే పేరుతో లచ్చయ్యపేట సుగర్స్‌ను మూసేశారు. వీటిని తెరిపించడం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలి. జీడి, మామిడి ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు నీటివసతి, రోడ్లు, భూమి పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా విటి అగ్రహారం, సారిపల్లి, బొబ్బిలి గ్రోత్ సెంటర్, కంటకాపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్లలో అనేక ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. సేవారంగంలో కూడా జిల్లా అట్టడుగు స్థానమే ఉంది. తాటిపూడి జలాశయం, చింతపల్లి బీచ్‌ల పర్యాటక కేంద్రాలుగా మార్చవచ్చు. రామతీర్థం తదితర పురాతన ఆధ్యాత్మిక కేంద్రాలు, విజయనగరం కోట, గంటస్తంభం వంటి పురాతన కట్టడాలు ఇప్పటికే సందర్శకులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. తీర ప్రాంత మత్స్యకారులకు సముద్రంలో చేపలవేటే జీవనాధారం. తీరంలో జట్టీ నిర్మాణంతోపాటు వేటాడిన చేపలను భద్రపర్చేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి.

విద్యల నగరంగా పేరుగాంచిన విజయనగరంలో దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేని డిగ్రీ కోర్సులు ఎంఆర్ కాలేజీలో ఉండేవి. నేడు ఆ కాలేజీ ప్రైవేటుపరం కావడంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవశ్యకత పెరిగింది. ఇటీవల ఏర్పాటు చేసినప్పటికీ భవనం లేదు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలో స్కూళ్లు, కాలేజీలు వాటిలోవున్న సదుపాయాలు పెంచాల్సిన అవసరం ఉంది. జెఎన్‌టియు వర్శిటీ కేవలం ఇంజనీరింగ్ కోర్సులకు పరిమితం. యూనివర్శిటీలు ఏర్పాటు చేయాలి. గిరిజన వర్శిటీ నిర్మాణ పనులు వేగవతం చేయాలి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇప్పటికీ సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రభుత్వం రంగంలో అందుబాటులోకి రాలేదు. ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లో తగిన రహదారులు, వైద్య సదుపాయాలు లేక డోలి మోతలే గత్యంతరంగా మారాయి. విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ తదితర అంశాల అమలు కోసం జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయాల్సివుంది. తద్వారా 2047 విజన్‌కు సార్థకత ఉంటుందని, కేవలం మొక్కుబడి ప్రణాళికలు, నివేదికలు వల్ల ఉపయోగం ఏమీ ఉండబోదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.



దుకాణం యజమానితో మాట్లాడుతున్న కమిషనర్ అప్పలరాజు

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో శత శాతం పన్ను వసూళ్లు జరగాలని కమిషనర్ కె. అప్పల రాజు అన్నారు. శనివారం ఆయన జరజాపు పేట సచివాలయం తనిఖీ చేసి షాప్‌ల పన్ను, ఇంటి పన్ను బకాయిల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఐదు షాపుల లీజుదారులు అద్దె బకాయి ఉన్నాయని సకాలంలో చెల్లించాలని సూచించారు. ఆస్తి, నీటి, ఇంటి పన్ను త్వరితగతిన చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి మేనేజర్ ఎంవి రమణ, ఆర్‌ఐ వైఎస్‌సిహెచ్ పాపయ్య రాజు, రాజ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధికి విరాళాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సిఎం సహాయ నిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపునివ్వడంతో తెర్లాం మండలం నందబలగ గ్రామానికి చెందిన పి కాశీనాయుడు, ఎ. నూకంనాయుడు, వి.ఆనందరావు, ఎం.అనంత్, సిహెచ్ పోలినాయుడు, జి.అప్పలనాయుడు రూ.30వేలు, రామన్నవలస గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, ప్రజలు కలిసి రూ.10,500, కొల్లివలస గ్రామ టిడిపి నాయకులు రూ.6వేలు విరాళాలను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. విరాళాలు ఇచ్చిన వారిని ఆయన అభినందించారు.



ఎంపిడిఒ సూర్యనారాయణను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఎంపిడిఒగా సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం నూతన ఎంపిడిఒగా సిహెచ్ సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇక్కడే ఇఒపిఆర్‌డిగా పనిచేసిన అనుభవం ఉందని కచ్చితంగా మండలాన్ని అభివృద్ధి చేస్తారని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపిడిఒకు సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ నెల 7 నుంచి శిక్షణ

ఈ నెల 7 నుంచి సర్పంచులకు, ఎంపిటిసిలకు, వార్డు మెంబర్లకు శిక్షణ ఉంటుందని ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాల గురించి మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నుంచి గురువారం వరకూ రెండు విభాగాలుగా శిక్షన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ అభివృద్ధికి దోహదపడే విధంగా ఈ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని ఆయన కోరారు.

బాల కార్మికులతో పనులు చేయిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

షాపులలో బాల కార్మికులతో పనులు చేపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ మూడో విడతలో భాగంగా శనివారం ఎఎల్‌ఒ గౌరీశంకర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎం.వెంకటరమణతో కలిసి షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులతో పనులు చేపించడం నేరమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కోరారు. షాపులలో పని చేస్తున్న ఆరుగురు బాల కార్మికులను గుర్తించి షాపు యజమానులపై కేసు నమోదు చేసి పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను చదివించాలని కోరారు.

నేడు ఉత్తరాంధ్ర కోలాటం పోటీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకళాభారతి ఆడిటోరియం కమిటీ సభ్యులు ఎన్. వేణుగోపాలనాయుడు, ఎం.విజయమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఎమ్మెల్యే బేబినాయన ముఖ్యఅతిథిగా హాజరవుతారని, జయప్రదం చేయాలని కళాకారులు, ప్రజలను కోరారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి- రాజాం

పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులులో పట్టుబడి, సిజ్ చేసినా మద్యం సీసాలను శనివారం నాడు డి.ఎస్.పి ఎస్. రాఘవులు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణంలో, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ధ్వంసం చేయడం జరిగింది. ఇలా ఉండగా డీఎస్పీ గారు మీడియాతో మాట్లాడుతూ 172 కేసుల్లో పట్టుబడిన, సుమారు లక్ష యాభై వేలు రూపాయలు విలువైన 1215 మద్యం బాటిల్ ను ధ్వంసం చేశారు. అనుమతి లేకుండా మద్యం బాటిల్ ని తెచ్చి విక్రయించిన, బెల్ట్ షాపులు నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని అన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

జామి: మండలంలోని జామి రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తహశీల్దార్ కృష్ణలత మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే ఉచిత పంటల భీమా పథకం గురించి వివరించారు. విఆర్‌ఒలు, సర్వేయర్స్ ప్రయోగం నిర్వహించే రైతు పొలాలను గుర్తించటానికి సహాయ పడాలని, తద్వారా పంట నష్టపోయే ప్రతి రైతుకు భీమా వర్తించేలా చేయొచ్చని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఒ శాంతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో గందరగోళం

- ఒకే గ్రామంలో ఇద్దరికి ఆర్డర్
- ఎంపిపి దగ్గర కార్యదర్శుల పంచాయితీ
- తాను చేరుతానంటే తాను చేరుతానని మంకు పట్టు
- 50 శాతం బదిలీల్లో ఇదే తంతు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఇక్కడ 50 శాతం బదిలీలు నాయకుల సిఫార్సుల మేరకు జరిగినా మిగిలిన 50 శాతం బదిలీల్లో అవకతవకలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ మండలం నుంచి బదిలీపై వెళ్లిపోయిన వారు, ఈ మండలానికి బదిలీపై వచ్చిన వారికి 50 శాతం మందికి న్యాయం జరిగిందని మిగిలిన 50 శాతం మందికి నాయకులకు చెప్పుకున్నా న్యాయం జరగలేదని కొంతమంది ఉద్యోగస్తులు వాపోయారు. కొంతమందికి మొదట బదిలీ అయిన ప్రదేశం ఆర్డర్ ఇవ్వగా మరి కొంతమందికి అదే ప్రదేశానికి రెండవసారి రివైజ్డ్ ఆర్డర్ ఇవ్వడంతో గందరగోళం మొదలైంది.

మండలంలో ఇద్దరు గ్రామ కార్యదర్శులకు గంట్లాం బదిలీ ఆర్డర్ ఇవ్వడంతో గందరగోళానికి బీజం పడింది. గుణుపూర్ పేటలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మణరావుకు మొదట మోపాడ బదిలీ అయింది. నెల్లిమర్ల మండలం నుంచి గంట్లాంకు వేరే వ్యక్తికి బదిలీ అయింది. ఆర్డర్ కాపీలు వారు అందుకోక ముందే మరలా రివైజ్డ్ ఆర్డర్ రాత్రికి రాత్రి మార్చి గంట్లాంకు బదిలీపై వచ్చిన నెల్లిమర్ల వ్యక్తికి మోపాడకు, అప్పటికే మోపాడ బదిలీ అయిన బి. లక్ష్మణరావుకు గంట్లాం ఆర్డర్ వచ్చింది. దీంతో పంచాయతీ కార్యదర్శులిద్దరూ ఆందోళనకు గురయ్యారు. 'ఆర్డర్ నాకే వచ్చింది నేనే గంట్లాంలో చేరుతానని ఒకరు, లేదు నాకు ముందొచ్చింది నేనే చేరుతానని మరొకరు గొడవ పడుతూ ఇద్దరు కార్యదర్శులూ ఎంపిపి వద్ద పంచాయితీ పెట్టారు. ఆ పంచాయితీలో తాను జాయిన్ అవుతానంటే తాను జాయిన్ అవుతానని ఎంపిపిపై ఒత్తిడి తెచ్చారు. దీనికి ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎమ్మెల్యే లోకం మాధవి అందుబాటులో లేరు కాబట్టి ఆమె వచ్చిన తరువాత తేల్చుకుందామని చెప్పినట్లుగా తెలిస్తోంది.

ఆయన వద్దు మహా ప్రభో..

బదిలీల్లో మార్పులు చేర్పులు జరిగాయని గంట్లాం గ్రామస్తులకు తెలియడంతో ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకులు కొంతమంది మండల కార్యాలయానికి చేరుకొని తమ గ్రామానికి మొదట నెల్లిమర్ల మండలం నుంచి ఎవరికైతే బదిలీ పై వచ్చారో వారే ఉండాలని, గుణుపూర్ పేట నుంచి బదిలీపై వస్తున్న బి. లక్ష్మణ్ రావు తమకు వద్దని ఎంపిపి వద్ద తేల్చి చేప్పేశారు. కార్యదర్శి బి. లక్ష్మణరావు ప్రవర్తన మంచిది కాదని, తరచూ పత్రికల్లో వస్తుంటారని ఈ మధ్యనే ప్రజాశక్తి పత్రికలో ఆయనపై వచ్చిందని ఆయన ఎక్కడుంటే అక్కడ గొడవలు ఉంటాయని అందుకే ఆయన తమకు వద్దని వాపోయారు. బదిలీలు సక్రమంగా జరగలేదని ఎమ్మెల్యే చెప్పినవి కొన్ని జరిగాయని, మరికొన్ని బదిలీలు కిందనున్న నాయకులు, ఎమ్మెల్యే పిఎ ద్వారా నడిపించారని, దీంతో బదిలీల్లో గందరగోళం నెలకొందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఇటువంటి గందరగోళ పరిస్థితి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

నిత్యం గ్రామాల్లోనే ఉండాలి

వేపాడ: సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్‌ఐ బి. దేవి అన్నారు. శనివారం వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో ఆమె మహిళా కానిస్టేబుళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న మార్పులను గమనిస్తూ సమస్యలను ఎలా పరిష్కరించాలో వివరించారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన

శృంగవరపుకోట: పట్టణంలోని విజయనగరం వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి కోట వీధికి వెళ్ళే మార్గంలో ఉన్న కల్వర్ట్ నిర్మాణానికి శనివారం మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గత 34 ఏళ్లుగా ఉన్న ఈ సమస్య ఇప్పటికి తొలగనుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, మేజర్ పంచాయతి సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహచలం, వార్డ్ మెంబర్లు ఆడారి సూరిబాబు, కోసూరు భారతి, మామిడి కృష్ణవేణి, వేములాపల్లి సర్పంచ్ సూర్యనారాయణ, మోపాడ గౌరినాయుడు, మోపాడ శ్రీను, బషీర్, బోజంకి గోవింద్, కారుకొండ వెంకటరావు, పంచాయతీరాజ్ జెఇ సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'టీ'లో ఎలుక మలం

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న టీ టైమ్‌లో శనివారం లెమన్ టీలో ఎలుక మలం కనిపించడంతో బాధితుడు ఒక్కసారిగా అవాక్కయ్యాడు. యాజమానినిని ఇదేంటని బాధితుడు ప్రశ్నించగా టీ పొడి ఉబ్బితే ఇలానే ఉంటుందని చెప్పడంతో లెమన్ టీలో టీ పొడి వెయ్యరు కదా అని ప్రశ్నించి డబ్బులు చెల్లించి అక్కడ నుంచి తిట్టుకుంటూ వెళ్లిపోయాడు. ఈ షాపు వద్దే ఆసుపత్రి రోగులు, మున్సిపల్ సిబ్బంది, చిరు వ్యాపారులు, ఇదే ఏరియాలో దేవి నవరాత్రులు జరగడంతో యాత్రికలతో పాటు పలువురు ప్రయాణికులు టీ తాగుతూ ఉంటారు. ప్రజల ప్రాణాలను లెక్కచేయని యాజమాన్యం పై ఫుడ్ సేఫ్టీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు?

మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల అసహనం

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామాల్లో సమస్యలపై గత సర్వసభ్య సమావేశంలో వెలుగులోకి తెచ్చినవి పరిష్కారం కానప్పుడు మరలా ఈ సమావేశాలు ఎందుకని సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రొంపల్లి ఎంపిటిసి శంకరరావు మాట్లాడుతూ ప్రతీ మండల సమావేశంలోనూ సమస్యలు సభ దృష్టికి తీసుకువస్తున్నా పరిష్కారం కావడంలేదని, అటువంటప్పుడు ఈ సమావేశాలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పూర్తికాకపోవడం సిగ్గుచేటన్నారు. హౌసింగ్ డిఇఇ అప్పయ్య మాట్లాడుతూ 2025లో కొత్త ఇళ్లు మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. 2014-19 మధ్యలో నిలిచిపోయిన హౌసింగ్ పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ మండలంలో 64 అంగన్వాడీ కేంద్రాలకు గానూ 16 కేంద్రాలకు భవనాలు లేవన్నారు. జన్నివలసకు వెళ్లే గ్రామంలో 1.5 కిలోమీటర్లలో 600 మొక్కలు నాటామని ఎపిఒ త్రినాధరావు తెలిపారు. అయితే అక్కడ మొక్కలు లేకపోయినా బిల్లులు చెల్లిస్తున్నారని ఎంపిటిసి మడక తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రంలోని కనిమెరక వీధిలో 3 ఇనుప విద్యుత్ స్తంభాలు ఉండడంతో తరచూ వర్షాకాలంలో షాక్ కొడుతున్నాయని, స్థంబాలను మార్చాలని ఎంపిటిసి భవిరెడ్డి చంద్ర కోరారు. ఇఒపిఆర్‌డి వెంకటరమణ మాట్లాడుతూ మండలానికి 15వ ఆర్థికసంఘ నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలకు ఖర్చు చేయాలన్నారు. మామిడివలసలో తాగునీటి సమస్య పరిష్కరించడంలో గ్రామీణాభివృద్ధి అధికారులు ఘోరంగా విఫలమయ్యారని ఎంపిటిసి మడక తిరుపతినాయుడు ఆరోపించారు. వంగపండు వలస గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించలేదని ఎంపిటిసి భవిరెడ్డి శంకరరావు అధికారుల దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం అధికారంలో జరిగిన రీసర్వే వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల భూముల రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై రైతులంతా మూకు మ్మడిగా మండల రెవెన్యూ కార్యాలయానికి తాళం వేసే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులు కానివారు హల్ చల్ చేశారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, ఎంపిడిఒ రత్నం, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణే రెడ్‌క్రాస్ లక్ష్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

విపత్తులు, అత్యవసర సమయాల్లో ఉపశమనాన్ని అందిస్తూ, ప్రజలం ఆరోగ్యం సంరక్షణే లక్ష్యంగా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ పని చేస్తుందని విజయనగరం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ అన్నారు. శనివారం రోటరీ క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ సమావేశ మందిరంలో బొబ్బిలి రోటరీ క్లబ్ డైరెక్టర్స్, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ సభ్యులందరూ రెడ్ క్రాస్ సంస్థలో సభ్యులుగా చేరి సమాజానికి సేవాలందించాలని కోరారు. బొబ్బిలి పట్టణంలో రెడ్ క్రాస్ సొసైటీ శాఖను ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని కోరారు. రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ప్రజా విశ్వాసాన్ని చురగొన్న సంస్థ అని విపత్తులలో, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో మావత్వాన్ని చూపుతూ సేవలందిస్తుందరి గుర్తు చేశారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో బొబ్బిలిలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ శాఖను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా 25 మంది సభ్యులు జీవిత కాల సభ్యులుగా రుసుమును చెల్లించి రెడ్ క్రాస్ సొసైటీలో చేరి అందుకు సంబం ధించిన దరఖాస్తులను చైర్మన్‌కి అందించారు. సమావేశంలో కార్యదర్శి ప్రవీణ్, చంద్ర కిషోర్, గెంబలి శ్రీనివాసరావు, శ్రీ హరి, నాగ రాజు, రామ కృష్ణ, హమీద్, రాజు, శివ కాంత్, కృష్ణమోహన్, శంకరరావు పాల్గొన్నారు.



బొబ్బిలి : రెడ్‌క్రాస్‌లో జీవితకాల సభ్యులుగా చేరుతున్నట్లు పత్రాలు అందిస్తున్న సభ్యులు

ప్రతి ఒక్కరూ బ్లడ్ గ్రూపు తెలుసుకోవాలి

రాజాం: ప్రతి ఒక్కరూ బ్లడ్ గ్రూపు తెలుసుకోవాలని జిఎంఆర్ ఐటి కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. శనివారం కళాశాలలో వన్ మిలియన్ బ్లడ్ గ్రూపింగ్ (లక్ష మందికి గ్రూపింగ్ చేయాలని) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఇప్పటికే 1200 మందికి బ్లడ్ గ్రూపింగ్ చేశారన్నారు. రెడ్ క్రాస్ చేపడుతున్న వన్ మిలియన్ బ్లడ్ గ్రూపింగ్‌లో రక్త పరీక్ష చేయించుకుని, వారు అందిస్తున్న బ్లడ్ గ్రూప్ కార్డును భద్రపరుచుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజాం అధ్యక్షులు కొత్తా సాయి ప్రశాంత్, అసోసియట్ డీన్ డాక్టర్ ఎం.వి. నాగేశ్వరరావు, ఎహెచ్‌ఒడిలు డాక్టర్ ఆర్‌ఎల్. నాయుడు, డాక్టర్ కె. శాంతారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కెవిఎస్. ప్రసాద్, రెడ్ క్రాస్ సభ్యులు పెంకి చైతన్య, నంది ఉమాశంకర్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వాలంటరీస్ పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఎస్.కోట నుంచి విశాఖకు పల్లె వెలుగు బస్సును శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి డిపో మేనేజర్ కే.రమేశ్‌తో కలిపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన పల్లె వెలుగు బస్సు ప్రతిరోజు ఎస్.కోట నుంచి విశాఖకు నాలుగు సర్వీసులు, విశాఖ నుంచి ఎస్.కోటకు నాలుగు సర్వీసులు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో పల్లె వెలుగు చార్జీలు మాత్రమే ఉంటాయన్నారు. విద్య, వైద్య, వ్యాపార నిమిత్తం చాలా మంది రోజూ వైజాగ్ ప్రయాణిస్తున్నారని వారందరికీ ఈ బస్ సర్వీసులు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, బిశెట్టి అరుణ, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, నాయకులు అనకాపల్లి చెల్లయ్య, ఆదిబాబు, పెదగాడ రాజు, బోనంగి జ్యోతి పాల్గొన్నారు.

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - వేపాడ

పంట వేసిన ప్రతి రైతూ ఈ పంట, ఇకెవైసి తప్పనిసరి అని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు అన్నారు. ఎఒ సిబి యశ్వంత్‌తో కలిసి శనివారం వల్లంపూడి, దబ్బిరాజుపేట, వేపాడ, ఆర్‌ఎస్‌పేట గ్రామాల్లో ఈ పంట, ఇకెవైసి నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలోని శతశాతం ఈ పంట, 93 శాతం ఇకెవైసి నమోదు చేశామన్నారు. ఈ పంటకు సంబంధించి తహాశీల్దార్‌కు, ఎఒకు 850 రికార్డులు తమ లాగిన్‌లోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస ఎడిఎ ఎల్ విజయ, వ్యవసాయ విస్తరణ అధికారి బి రమేష్, వల్లంపూడి విఆర్‌ఒ బాల భాస్కరరావు, వ్యవసాయ సహాయకులు, సర్వే అసిస్టెంట్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతుకు ఇ-పంట నమోదు చేస్తున్న జిల్లా అధికారి

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి- బొబ్బిలి

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు కోరారు. స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శనివారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల జీవితాలు నాశనం అవుతాయని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ అమ్మినా, వాడిన సమాచారం ఇవ్వాలని కళాశాలలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం: మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్. రాఘవులు అన్నారు. పట్టణంలోని జిసిఎస్‌ఆర్ కాలేజీలో శనివారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే గంజాయిపై గట్టి నిఘా ఉంచామన్నారు అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ సిఐ కె. అశోక్ కుమార్, ఎస్‌ఐ నరసింహమూర్తి, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.



రాజాం: ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎస్‌పి తదితరులు

క్రీడల్లో ప్రతిభ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శిక్షణ పొందుతున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారినులు పంపాన మౌనిక, భరణికన హారికలు బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటారు. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఇంటర్ కాలేజ్ బ్యాడ్మింటన్ టీం ఛాంపియన్షిప్ లో ద్వితీయ స్థానం సాధించారని చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు శనివారం తెలిపారు. మౌనిక, హారికలు ప్రస్తుతం పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో మొదటి సంవత్సరం బిఎ చదువుతున్నారు. వీరు ఇంతకుముందు కూడా అనేక జిల్లా స్థాయి బ్యాడ్మింటన్‌లో చాంపియ న్లుగా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇంతవరకు ఆంధ్ర యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ బ్యాడ్మింటన్‌లో ఎస్.కోటకు టైటిల్ లేదని, ఇప్పుడు వీరి ద్వారా ఆశయం నెరవేరిందని చాలా ఆనందంగా ఉందని శ్రీరాములు తెలిపారు. వీరికి ఈ పోటీలకు కోచ్‌గా పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్. శివకుమార్ వ్యవహరిం చారని అన్నారు. ఇంత ఘనత సాధించిన క్రీడాకారి నులను జిల్లా బ్యాడ్మింటన్ అసోసి యేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘురాజు, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అట్లూరి శ్రీ ఫ్రెండ్స్ వెంకట్రావు, ఆనల మోహన్, ఆనల రమేష్, ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకా డమీ కోచ్ మహమ్మద్ అస్లాం, తల్లి దండ్రులు అభినందనలు తెలిపారు. ద్వితీయ స్థానం సాధించిన మౌనిక, హారికలను కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ కేశవరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

తైక్వాండో పోటీలలో ప్రతిభ

బొబ్బిలి : తైక్వాండో జిల్లా స్థాయి పోటీలలో బొబ్బిలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. విజయనగరంలోని గతనెల 25న అండర్-14 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఈపోటీలో షేక్ అబ్దుల్లా, రెడ్డి సృజన ప్రథమ స్థానం సాదించి ప్రతిభ కనబరిచి ఈనెల 6 నుంచి 8వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రీడాకారులను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు.

తాత్కాలిక కోర్టు భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎస్.కోట ప్రధాన రహదారి గ్యాస్ కంపెనీ సమీపంలో తాత్కాలిక జూనియర్ సివిల్ జడ్జి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ చక్రవర్తి, జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి శనివారం ప్రారంభించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ త్వరితగతిన శిథిలావస్థలో ఉన్న భవనం స్థానంలో కొత్త కోర్టు భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ముందుగా తాత్కాలిక కోర్టు భవనాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన జిల్లా జడ్జి సాయి కళ్యాణ చక్రవర్తిని వేద పండితులు మంత్రో చ్చారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.సూరిదేముడు, ప్రధాన కార్యదర్శి బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది ఎం.దుర్గాప్రసాద్ దంపతులు దక్షిణామూర్తి పూజ, గణపతి హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అప్పలనాయుడు, సీనియర్ న్యాయ వాదులు మండా కామేశ్వరరావు, అల్లు సత్యాజీ, నానిగిరి తులసీదాసు, గేదెల ప్రకాష్, టి.టి.వి.రమనాజీ, బి.త్రిమూ ర్తులు, ఎం.దొరబాబు, డబ్ల్యు.ఎన్.శర్మ, వారాది ఈశ్వరరావు, టి.వి.ఆర్.మూర్తి, బి.వి.ఎస్.రామారావు, ఆర్.సత్యనారాయణ, ఎం.అనూరాధ, సిహెచ్. ఆర్‌వి నాయుడు, బి.వెంకటరావు, బడబళ్ల రామ కృష్ణ, బొబ్బిలి రామకృష్ణ, సంతోష్, పలువురు జూనియర్ న్యాయవాదులు, ఎస్.కోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.ఎన్. మూర్తి, ఎస్.ఐలు భాస్కరరావు, జనార్దన్, కోర్టు సూపరింటెండెంట్ ఉపేంద్ర, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి